


# కరపత్రం

SINCE 2014

శనివారం జూలై 25, 2026 | సంపుటి : 2 | సంచిక : 283 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4



పోలీసు, రెవెన్యూ, రవాణా శాఖల భూముల సేకరణ

# జనావాసాల్లోనే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

## ◆ ఓఆర్ఆర్ లోపల ప్రభుత్వ భూముల గుర్తింపు

» క్యూర్ పరిధిలో ఇళ్ల నిర్మాణంపై సీఎం రేవంత్ సమీక్ష

**హైదరాబాద్,జూలై24 :**
నగరంలోని కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ క్యూర్ పరిధిలో నిర్మించే ఇందిరమ్మ ఇళ్లు జనావాసాల పరిధిలోనే ఉండేలా చూడాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. క్యూర్ పరిధిలో ఇళ్లపై ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఓఆర్ఆర్ లోపల నిరుపయోగంగా ఉన్న వివిధ స్థలాలను గుర్తించాలని సూచించారు. ఇప్పటికే పలు నియోజకవర్గాల్లో స్థలాలను గుర్తించినట్లు అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. పోలీసు, రెవెన్యూ, రవాణా శాఖలకు సంబంధించిన స్థలాలను తీసుకుని.. ఆయా శాఖలకు వేరే చోట కేటాయించాలని రేవంత్ ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లను జనావాసాలకు దూరంగా కేటాయిస్తే ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ఇబ్బందులు తలెత్తడంతో పాటు అవి నిరుపయోగంగా మారే అవకాశముందని సీఎం అభిప్రాయపడ్డారు. ప్రజల పని ప్రదేశాలకు దగ్గరగా.. జనావాసాల పరిధిలో ఇళ్లు నిర్మిస్తే నిరుపేదలు జీవనోపాధి కోల్పోకుండా ఉంటారన్నారు. క్యూర్ ఏరియాలోని పలు నియోజకవర్గాల్లో ఒక్కో ప్లాట్ దాదాపు 528 చదరపు అడుగుల విస్తీర్ణంతో, 400 చదరపు అడుగుల కార్పెట్ ఏరియాతో ఇళ్లు నిర్మించనున్నారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి దాదాపు రూ. 11 లక్షలు ఖర్చవుతుండగా, దీనిలో ప్రభుత్వం రూ. 5 లక్షల మేర సబ్సిడీని అందించనుంది. మిగిలిన రూ.6 లక్షలు లబ్ధిదారుడి వాటాగా చెల్లించాల్సి ఉంటుంది. భూమికయ్యే ఖర్చు మొత్తం ప్రభుత్వమే భరించనుంది. తొలి దశలో 17 నియోజకవర్గాల్లో 7,680 ప్లాట్లు నిర్మించి ఇచ్చేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలాలను వెంటనే గుర్తించి ఇళ్ల నిర్మాణానికి వినియోగించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఔటర్ రింగ్ రోడ్ లోపల ఉన్న ఖాళీ ప్రభుత్వ భూములపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం ఆదేశించారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు దగ్గరగా ఉండే ప్రాంతాల్లోనే ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలని పేర్కొన్నారు. పోలీస్, రెవెన్యూ, రవాణా శాఖల పరిధిలో ఖాళీగా ఉన్న స్థలాలను గృహ నిర్మాణం కోసం వినియోగించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఖాళీ ప్రభుత్వ భూముల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

మిగతాద్ది 2 లో

# ౨౦ ఏళ్లకు సరిపడా బొగ్గు నిల్వలు

- విద్యుత్ డిమాండ్‌కు తగ్గట్లుగా ఏర్పాట్లు
- క్షేత్రస్థాయి పర్యటనలతో సమీక్షిస్తున్నాం
- భద్రాద్రి జిల్లా పర్యటనలో డిప్యూటి సిఎం భట్టి



**భద్రాద్రి కొత్తగూడెం,జూలై24 :**
సింగరేణి బొగ్గు బ్లాకులు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళితే సంస్థ ఉనికికే తీవ్ర ప్రమాదమని తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. భద్రాద్రి జిల్లా పర్యటనలో ఆయన మాట్లాడుతూ, గతంలో వేలంలో పాల్గొనకపోవడం వల్లే రెండు బొగ్గు బ్లాకులు ప్రైవేటు పరం అయ్యాయని, తమ ప్రభుత్వం వచ్చాక ఈ పరిస్థితిని మార్చి సింగరేణిని వేలం పాటల్లో పాల్గొనేలా అనుమతులు ఇచ్చామని తెలిపారు. పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా రాబోయే 20 సంవత్సరాలకు సరిపడా బొగ్గు నిల్వలు ఉండేలా పక్కా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, అందులో భాగంగానే ఈ క్షేత్రస్థాయి పర్యటనలు నిర్వహిస్తున్నామని ఆయన వివరించారు. గత పదేళ్ల బిఆర్ఎస్ ప్రభుత్వంలో పేరుకుపోయిన బకాయిలను తాము అధికారంలోకి వచ్చాక సమన్వయంతో సరిచేస్తున్నామని స్పష్టం చేశారు. పదేళ్ల క్రితం బిఆర్ఎస్, బిజెపిలు అధికారంలో ఉన్నప్పుడు నోరు మెదపకుండా, తాడిచెర్ల బ్లాక్‌ను అడ్డుపెట్టుకుని ఇప్పుడు సింగరేణిపై నకిలీ ప్రేమ ఒలకబోస్తున్నారని, ఈ విషయాన్ని కార్మికులు గమనిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో థర్మల్ విద్యుత్ కేంద్రాల డిమాండ్‌కు తగ్గట్టుగా సరైన ప్రణాళికలు రూపొందించకపోవడం వల్లే నేడు తీవ్ర బొగ్గు కొరతను ఎదుర్కోవాల్సి వస్తోందని భట్టి విక్రమార్క ఆవేదన వ్యక్తం చేశారు.

మిగతాది 2లో



## తెలంగాణ అభివృద్ధికి ప్రవాసులు సహకరించాలి

» కాలిఫోర్నియా పర్యటనలో మంత్రి సీతక్క పిలుపు

**హైదరాబాద్,జూలై24 :**
పల్లెలు దేశానికి పట్టుకొమ్మలన్న బాపూజీ స్ఫూర్తితో ప్రవాసులు తెలంగాణ గ్రామీణాభివృద్ధికి సహకరించాలని తెలంగాణ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా సంక్షేమ శాఖ మంత్రి సీతక్క కోరారు.

మిగతాది 2లో

## గ్లోబరీనా సంస్థ నిర్వాకంతో 28మంది బలి

- వారందరికి కెటిఆర్ 2 కోట్ల చొప్పున చెల్లించాలి
- బర్త్‌డే రోజయినా అబద్దాలు మాట్లడకుండా ఉండలేదు
- మీడియా సమావేశంలో మండిపడ్డ పిసిసి చీఫ్



**హైదరాబాద్,జూలై24 :**
బీఆర్ఎస్ హయాంలో గ్లోబరీనా సంస్థ విద్యార్థుల చావుకు కారణమైందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు.

# కాక్రోచ్ ఆందోళనలకు బిఆర్ఎస సంఘీభావం




» కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే
» ఇందిరాపార్క్ ధర్నాలో కెటిఆర్ డిమాండ్

**హైదరాబాద్,జూలై24 :**
ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా నిరసన చేపట్టిన విద్యార్థులపై జరిగిన దాడులు అమానుషమని కేటీఆర్ పేర్కొన్నారు. యువత జవాబుదారీతనం కోరుతోందని.. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. యువతపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని పేర్కొన్నారు. ఈ మేరకు విద్యార్థులకు సంఘీభావం తెలుపుతూ హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద కేటీఆర్ నిరసన దీక్ష చేపట్టారు.

మిగతాద్ది 2 లో

## కాళేశ్వరం బ్యారేజీల భవిష్యత్ నిర్వహణపై కేంద్రానికి లేఖ

» జల్ శక్తి మంత్రిత్వ శాఖ, ఎన్‌డీఎస్ఏ నుంచి మార్గదర్శకాలు కోరాలి
» ఎన్‌డీఎస్ఏ సూచనల మేరకే ఫ్రీ-ఫ్లో మోడ్‌లో బ్యారేజీలు
» పూర్తి సాంకేతిక నివేదికల ఆధారంగానే తుది నిర్ణయం
» అధికారులతో సమీక్షలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



మిగతాది 2లో



## పరీక్షలకు తాత్కాలిక సర్దుబాట్లు సరికాదు

- శాశ్వత ప్రాతిపదికన పక్కాగా నిర్వహణ చేపట్టాలి
- నివేదిక కోరుతూ కేంద్రం, ఎటిఎకు సుప్రీం ఆదేశం

**న్యూఢిల్లీ,జూలై24 :**
దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పేపర్ లీక్ వ్యవహారం తర్వాత చేపట్టిన సంస్కరణల పురోగతిపై సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది.

2 లో

## ఢిల్లీ ఆందోళన ముసుగులో

# అరచాక శక్తులు

» పార్లమెంట్‌పై దాడి చేసేందుకు కుట్రలు
» పోలీసులు, జర్నలిస్టులపై దాడులకు తెగించారు
» నిజమైన విద్యార్థుల చేతుల్లో రాళ్లు ఎక్కడినుంచి వచ్చాయి
» విపక్షాలు పార్లమెంట్‌కు రాకుండా ఎగదోసే కార్యక్రమం చేశాయి
» దుష్ప్రచారం చేస్తున్న పాక్‌కు చెందిన 480 సోషల్ మీడియా అకౌంట్లు సీజ్
» గతంలో అన్ని రాష్ట్రాల్లో పేపర్లు లీక్ అయితే వారంతా రాజీనామా చేశారా
» మీడియా సమావేశంలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్

**హైదరాబాద్,జూలై24 :**
ఢిల్లీలో జరిగిన ఆందోళనల్లో విద్యార్థుల ముసుగులో మతతత్వ, కమ్యూనిస్ట్ శక్తులు అరాచకం సృష్టించాయని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ విమర్శించారు. అలాగే పార్లమెంట్‌పై దాడి చేసేందుకు కుట్ర కూడా చేశారని మండిపడ్డారు. అందులో భాగంగానే దేశ వ్యతిరేక నినాదాలు చేశారని ఆరోపించారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ..



2లో..



02

## తుంగతుర్తి ప్రజలకు క్షమాపణలు చెబుతున్నా: రాజగోపాల్‌రెడ్డి

**భువనగిరి:**
తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ వ్యాఖ్యలపై మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి స్పందించారు. ఆయన తనకు వ్యతిరేకంగా మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. తనని నమ్మి సామేల్‌ను గెలిపించినందుకు తుంగతుర్తి ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తనని క్షమించాలని కోరారు.

# మా జోలికి వస్తే రాజకీయ సమాధి తప్పదు

- మేమే డప్పులు కొడతాం.. దండోరా మోగిస్తాం
- కోమటిరెడ్డి బ్రదర్స్‌కు మందల సామేలు హెచ్చరిక



2లో..

**సూర్యాపేట,జూలై24 :**
జిల్లా కాంగ్రెస్ రాజకీయంలో తీవ్ర సంచలనం చోటుచేసుకుంది. తుంగతుర్తి కాంగ్రెస్ శాసనసభ్యుడు మందుల సామేల్ సొంత పార్టీకి చెందిన రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఉమ్మడి నల్గొండ జిల్లా రాజకీయంలో కోమటిరెడ్డి సోదరుల వైఖరిని తప్పుబడుతూ ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపుతున్నాయి. మా జోలికొస్తే మీ రాజకీయ సమాధికి మేమే డప్పులు కొడతాం, మా దండోరా మోగుతుంది. అహంకార పూరితమైన రాజకీయాన్ని చావుదెబ్బ తీస్తాం‘ అని ఘాటు వ్యాఖ్యలు చేశారు.



## బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య

**రంగారెడ్డి:**
మరో విద్యార్థిని బలవన్మరణానికి పాల్పడింది. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో బీటెక్ చదువుతున్న విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. గురునానక్ కాలేజీలో బీటెక్ థర్డ్ ఇయర్ చదువుతున్న మానస అనే విద్యార్థిని ఉరేసుకుని ప్రాణం తీసుకుంది.

## కాక్రోచ్ ఆందోళనలకు బిఆర్ఎస సంఘీభావం

మొదటి పేజీ తరువాయి

ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా నిరసన చేపట్టిన విద్యార్థులపై జరిగిన దాడులు అమానుషమని కేటీఆర్ పేర్కొన్నారు. యువత జవాబుదారీతనం కోరుతోందని.. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. యువతపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని పేర్కొన్నారు. ఈ మేరకు విద్యార్థులకు సంఘీభావం తెలుపుతూ హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద కేటీఆర్ నిరసన దీక్ష చేపట్టారు.

ఈ సందర్భంగా ఢిల్లీలో విద్యార్థులు, యువత పోరాటానికి బీఆర్ఎస్ తరఫున కేటీఆర్ సంఘీభావం ప్రకటించారు. 25 రోజులుగా ఢిల్లీలో పార్టీలకు అతీతంగా యువత పోరాడుతోందన్నారు. యువతపై జరుగుతున్న దాడులను దారుణమని తీవ్రంగా ఖండించారు. ఎవరితో పెట్టుకోకూడదో వారితోనే ప్రధాని మోదీ పెట్టుకున్నారని.. ఈ జనరేషన్ చావుకు, ఐటీ, ఈడీ సోదాలకు భయపడేది కాదన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న మోదీ.. మేక్ ఇన్ ఇండియా అడిగితే లీక్ ఇన్ ఇండియా ఇచ్చారంటూ సెటైర్లు వేశారు. న్యాయం చేయాలని విద్యార్థులు అడుగుతున్నారని, వారికి అండగా నిలబడతామని కేటీఆర్ చెప్పుకొచ్చారు. ప్రధాని మోదీపై కొట్లాడితే చోటాభాయ్‌కు ఎందుకు కోపం వస్తుందో అర్థం కావడం లేదని సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి కేటీఆర్ చురకలు అంటించారు. మోదీ అంటే రేవంత్‌కు ఎందుకంత భయమంటూ ప్రశ్నించారు. పాత కేసులు తోడుతారని సీఎం భయపడుతున్నారని ఎద్దేవా చేశారు.

ఢిల్లీ లో మోదీ ఇంటి ముందు రాహుల్ గాంధీ ధర్నా చేస్తే రేవంత్ ఎక్కడ ఉన్నారని కేటీఆర్ ప్రశ్నించారు.

నీట్ పేపర్ లీక్‌పై ఆయన ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నలు సంధించారు. విద్యార్థులను కొడుతుంటే సీఎం ఎందుకు మౌనంగా ఉన్నారన్నారు. పేపర్ లీక్‌కు తనకు సంబంధం ఏంటని, యూత్ కాంగ్రెస్ వాళ్లకు బుద్ధి ఉందా? అంటూ మండిపడ్డారు. వాళ్లు దేశంలో ఏం జరిగినా.. కేసీఆర్, కేటీఆర్‌దే తప్పు అంటున్నారని ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డికి నిద్రలో కూడా కేసీఆరే గుర్తు వస్తున్నారని కేటీఆర్ చురకలు అంటించారు. నీట్ విద్యార్థులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు.

## జనావాసాల్లోనే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

మొదటి పేజీ తరువాయి

నిరుపేదలకు నగరానికి చేరువలోనే గృహాల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. రాజేంద్రనగర్, మహేశ్వరం, శేరిలింగంపల్లి, ఇబ్రహీంపట్నం, మల్కాజిగిరి, నాంపల్లి, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, కార్వాన్, బహదూర్‌పురా, అంబర్‌పేట్, కూకట్‌పల్లి, మేడ్చల్, కుత్బుల్లాపూర్, సనత్‌నగర్, సికింద్రాబాద్ కంటోన్మెంట్, మలక్‌పేట్ నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఇళ్లను నిర్మించనున్నారు. ఈ నియోజకవర్గాల పరిధిలో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలాలను గుర్తించే పక్రియను వేగవంతం చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పరీక్షలకు తాత్కాలిక సర్దుబాట్లు సరికాదు

మొదటి పేజీ తరువాయి

పరీక్షల నిర్వహణలో తాత్కాలిక సర్దుబాట్లు కాకుండా, శాశ్వత వ్యవస్థాగత సంస్కరణలు ఎలా అమలు చేస్తున్నారో వివరిస్తూ సమగ్ర అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్ర ప్రభుత్వం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీలను సుప్రీంకోర్టు ధర్మాసనం ఆదేశించింది. పరీక్షల వ్యవస్థలో పారదర్శకత, భద్రత పెంచేందుకు చేపట్టిన చర్యలపై 10 ప్రధాన రంగాల వారీగా వివరాలు సమర్పించాలని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. డిజిటల్ మౌలిక వసతులు, భద్రతా ప్రమాణాలు, పరిశోధన, పారదర్శకత, పరిపాలన, మానవ వనరులు వంటి అంశాలపై పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని సూచించింది. పరీక్ష జరగడానికి ముందు, పరీక్ష సమయంలో , పరీక్ష పూర్తయిన తర్వాత చేపట్టిన సంస్కరణలపై స్టేటస్ రిపోర్ట్ అందించాలని ఆదేశించింది. పరీక్షా పత్రాల సురక్షిత రవాణా కోసం భారత వైమానిక దళాన్ని ఉపయోగించడంపై జస్టిస్ పి.ఎస్. నరసింహ వ్యాఖ్యానిస్తూ... ఇది ఒక తాత్కాలిక నివారణ చర్య మాత్రమే తప్ప, పరీక్షల భద్రతకు శాశ్వత పరిష్కారం కాదని స్పష్టం చేశారు. అలాగే, భవిష్యత్తులో కంప్యూటర్ ఆధారిత పరీక్ష విధానం అమలు పురోగతి, అభ్యర్థుల సమాచారాన్ని కాపాడే డేటా రక్షణ చర్యలపై వివరణ ఇవ్వాలని కోరింది. అభ్యర్థుల ధృవీకరణ కోసం 'డిజీయాత్ర' వంటి ఆధునిక సాంకేతికతలను ఉపయోగించే ప్రతిపాదనలపై స్పష్టత ఇవ్వాలని కేంద్రానికి సూచించింది. పరీక్షల పర్యవేక్షణకు సంబంధించి ప్రతిపాదించిన గవర్నింగ్ బోర్డు, నిపుణుల కమిటీలు, స్టేక్‌హోల్డర్ నామినేషన్ల ఏర్పాటు ఎంతవరకు వచ్చిందో నివేదికలో తెలపాలని ఆదేశించింది. దీనిపై స్పందించిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, కోర్టు సూచించిన అన్ని అంశాలతో సమగ్రమైన తాజా అఫిడవిట్‌ను త్వరలోనే దాఖలు చేస్తామని హామీ ఇచ్చారు. దానికి ధర్మాసనం ఆమోదం తెలిపింది. ఔఇఇఞ వంటి అత్యంత కీలకమైన జాతీయ పరీక్షల్లో సంస్కరణల అమలును కోర్టు నిరంతరం పర్యవేక్షిస్తుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అనంతరం ఈ కేసు తదుపరి విచారణను వచ్చే సోమవారానికి వాయిదా వేసింది.

## తెలంగాణ అభివృద్ధికి ప్రవాసులు సహకరించాలి

మొదటి పేజీ తరువాయి

కాలిఫోర్నియా పర్యటనలో భాగంగా ఫ్రీమాంట్‌లో ఇండియన్ ఓవర్‌సీస్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి సీతక్క పాల్గొని ప్రసంగించారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని అన్నారు. సీఎం కృషికి చేయూతగా ప్రవాసులు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని, గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా సేవా కార్యక్రమాలు, ఉపకారవేతనాలు, తాగునీటి సరఫరా, మౌలిక వసతుల కల్పనకు చొరవ చూపాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. మహిళల భద్రతకు తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. ఢిల్లీలో సీజేపీ విద్యార్థులకు మద్దతుగా రాహుల్‌గాంధీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ప్రయత్నానికి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీరెడ్డి, ఓవర్‌సీస్ కాంగ్రెస్ ప్రతినిధులు సందీప్ వంగల, నెమలి మాధవ, శ్రీనివాస్ రామసహాయం, గూడూరు రవీందర్ రెడ్డి, గీతా చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## తుంగతుర్తి ప్రజలకు క్షమాపణలు చెబుతున్నా: రాజగోపాల్‌రెడ్డి

మొదటి పేజీ తరువాయి

భువనగిరి కలెక్టరేట్‌లో మీడియాతో రాజగోపాల్‌రెడ్డి మాట్లాడారు."రాష్ట్రంలో నేను అడిగిన రెండు సీట్లలో తుంగతుర్తి ఒకటి. మందుల సామేల్‌కు పార్టీ టికెట్ ఇప్పించి ఆయన గెలుపునకు సహకరించా. అలాంటి వ్యక్తి నాపై చేసి వ్యాఖ్యలను ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నా. నా అభిమానుల మద్దతుతో గెలిచిన వ్యక్తి.. నేడు నాపై విమర్శలు చేయడం ఎంతవరకు సమంజసం? కాంగ్రెస్ పార్టీ నిజమైన కార్యకర్తలను కాపాడుకోవడమే నా ప్రధాన లక్ష్యం. సామేల్ ఎలాంటి విమర్శలు చేసినా కోమటిరెడ్డి బ్రదర్స్ అభిమానులు, కాంగ్రెస్ కార్యకర్తలు సహనంతో ఉండాలి. కొత్తగా పార్టీలోకి వచ్చిన వారిని గౌరవిస్తాం. అదే సమయంలో పాత కార్యకర్తలను విస్మరించిన వారిని ఇబ్బందులకు గురిచేస్తే చూస్తూ ఊరుకునేది లేదు. నిజమైన కార్యకర్తలను కాపాడుకునేందుకు ఎలాంటి త్యాగానికైనా సిద్ధమే. నిజమైన కార్యకర్తలకు న్యాయం చేసేందుకు పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ ప్రత్యేక చొరవ తీసుకోవాలి" అని రాజగోపాల్‌రెడ్డి కోరారు.

# ఢిల్లీ ఆందోళన ముసుగులో అరచాక శక్తులు

మొదటి పేజీ తరువాయి

పోలీసులు, జర్నలిస్టులపై దాడులతో పాటు అసభ్యంగా ప్రవర్తించారని వివరించారు. పోలీసుల తలలు పగిలినా ఎక్కడా ఫైరిరగ్ చేయలేదని గుర్తు చేశారు. ఈ సమయంలో 118 మంది పోలీసులకు తీవ్ర గాయాలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. విధి లేని పరిస్థితుల్లో అరాచక శక్తులపై తప్పనిసరిగా పోలీసులు లాఠీఛార్జ్ చేయాల్సి వచ్చిందని వివరించారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారం లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు, తల్లిదండ్రుల భావోద్వేగాలతో ముడిపడిన అంశమని అన్నారు. అందుకే ఈ విషయంలో అందరికంటే ప్రధాని మోదీ ఎక్కువగా బాధపడుతున్నారని చెప్పారు. పేపర్ లీక్ చేసిన నిందితులకు కఠిన శిక్ష పడేలా ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. సీబీఐ ఇప్పటికే 11 మంది ఫ్యాకల్టీతో సహా 17 మందిని అరెస్ట్ చేశారని వివరించారు. విద్యార్థుల ఆందోళనను తాము అర్థం చేసుకున్నామని పేర్కొన్నారు. దీనిపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధరేంద్ర ప్రదాన్ క్షమాపణలు చెప్పారని అన్నారు. విద్యార్థుల విద్యా సంవత్సరం నష్టపోకుండా 40 రోజుల్లోనే నీట్ పరీక్షలు మళ్లీ నిర్వహించి.. వాటి ఫలితాలు కూడా ప్రకటించారని వివరించారు. పాకిస్థాన్ నుంచి సోషల్ మీడియా ద్వారా విష ప్రచారం చేస్తూ ఉద్రిక్తతలు సృష్టిస్తున్నారని అన్నారు. అందుకే ఆ దేశానికి చెందిన 480 సోషల్ మీడియా అకౌంట్లను కేంద్రం బ్లాక్ చేసిందని చెప్పారు. ఈ విషయాన్ని అర్థం చేసుకోవాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులను కోరుతున్నానని తెలిపారు. నీట్‌కు, ఆర్టికల్ 370 రద్దుకు సంబంధం ఏమిటి? నీట్‌కు, ఆజాద్ కాశ్మీర్‌కు సంబంధం ఏమిటి? నీట్‌కు బంగ్లాదేశ్, పాకిస్థాన్, నేపాల్, శ్రీలంకకు సంబంధం ఏమిటి? నీట్‌కు సనాతన ధర్మానికి, రాముడికి, సీతమ్మకు సంబంధమేమిటి? అని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ సందేహం వ్యక్తం చేశారు. విద్యార్థులెవరూ దేశ ద్రోహ నినాదాలు చేయబోరని పేర్కొన్నారు. డాక్టర్ కావాలనుకునే విద్యార్థులెవరూ రాళ్లు విసరరని పేర్కొన్నారు. లాఠీలు పట్టుకోరని, మహిళలపై అసభ్యంగా ప్రవర్తించరని అన్నారు. పార్లమెంట్‌లో ఎందుకు చర్చలకు సిద్ధంగా లేరంటూ విపక్షాలను ఆయన సూటిగా ప్రశ్నించారు. చర్చలతో రాద్ధాంతాలు చేసి రాజకీయం చేయడమే వాళ్ల లక్ష్యమని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీట్ పేపర్ లీకై రెండు నెలలు దాటినా కాంగ్రెస్, ప్రతిపక్షాలు ఏనాడూ దీనిపై పెదవి విప్పలేదని చెప్పారు. కాక్రోచ్ పార్టీ ధర్నాలతో మొన్న సడెన్‌గా ప్రధాని నివాసాన్ని ముట్టడించేందుకు కాంగ్రెస్ కుట్ర చేసిందని ఆరోపించారు. నీట్ సమస్య పరిష్కారం, విద్యార్థుల భవిష్యత్తుపై ఇండియా కూటమికి ఆలోచనే లేదని చెప్పుకొచ్చారు. మోదీని దించి కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌ను ప్రధానిని చేయడమే వాళ్ల ఏకైక లక్ష్యమని అన్నారు. అందుకోసమే ప్రధాని, హోం, విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారని పేర్కొన్నారు. అయినా కాంగ్రెస్ చేస్తే సంసారం... ఇతరులు చేస్తే వ్యభిచారమా? అని విపక్ష తీరు పట్ల తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. పంజాబ్‌లో ఆప్ ప్రభుత్వ హయాంలో ప్లస్ 2 పేపర్ లీకైతే కేజ్రీవాల్ సారీ చెప్పారా? సీఎంతో రాజీనామా చేయించారా ? అని ఆ పార్టీ నేతలను ప్రశ్నించారు. కర్నాటకలో టెన్త్ క్లాస్, పీయూసీ పేపర్ లీకైతే సీఎంతో, విద్యాశాఖ మంత్రితో రాజీనామా చేయించారా? అని కాంగ్రెస్ నేతలను ఆయన నిలదీశారు. ఉత్తరప్రదేశ్‌లో ములాయం సింగ్, అఖిలేష్ యాదవ్ ప్రభుత్వ హయాంతో ఎన్నోసార్లు పేపర్ లీక్ అయ్యాయని గుర్తు చేశారు. మరి వారు రాజీనామా ఎందుకు చేయలేదంటూ విపక్షాలను బల్లగుద్ది ప్రశ్నించారు. పశ్చిమ బెంగాల్‌లో టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ పేపర్ లీకైతే నాటి సీఎం మమతా బెనర్జీ రాజీనామా చేశారా? అని ప్రశ్నించారు. కేరళలో ఎల్‌డీఎఫ్ పాలనలో స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షల్లో భారీగా అవకతవకలు జరిగితే పినరయి విజయన్ ఎందుకు సీఎం పదవికి రాజీనామా చేయలేదని అన్నారు. కేసీఆర్ పాలనలో ప్రభుత్వం అంటేనే పేపర్ లీక్ ప్రభుత్వంగా మారిందని.. ఇది నిజం కాదా? అని ప్రశ్నించారు. నాడు ఎంసెట్ పేపర్, టీఎస్పీఎస్సీ గ్రూప్ 1 పేపర్, ఎస్ఎస్సీ తెలుగు, హిందీ పేపర్లు లీకయ్యాయన్నారు. పరీక్షలంటే పేపర్లు అమ్ముకుని విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేశారంటూ బీఆర్ఎస్ నేతలపై నిప్పులు చెరిగారు. మరి ఆనాడు కేసీఆర్, కేటీఆర్ రాజీనామా చేశారా? అని నిలదీశారు. తాను గ్రూప్ -1 పేపర్ లీక్‌పై పోరాటం చేస్తుంటే ఏమైందో మీరంతా చూశారని చెప్పారు. టెన్త్ పేపర్ లీక్ చేస్తే వాడిని పట్టుకోకుండా తనపై కేసు పెట్టి అరెస్ట్ చేసి జైలుకు పంపారని గుర్తు చేసుకున్నారు. ఇన్ని తప్పిదాలు చేసిన బీఆర్ఎస్ నాయకులు సిగ్గు లేకుండా పేపర్ లీక్‌పై ధర్నా చేయడమా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధర్నా చౌక్‌ను ఎత్తేసినోడు ఈరోజు ధర్నాకు కూర్చుంటే ఇందిరా పార్క్, ఎన్టీఆర్ స్టేడియం నవ్వుతున్నయంటూ వ్యంగ్యంగా అన్నారు. కనీసం పుట్టినరోజు కూడా నిజాలు చెప్పలేదు.. నోరు తెరిస్తే పచ్చి అబద్దాలు మాట్లాడుతున్నాడంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై బండి సంజయ్ మండిపడ్డారు. ÷-విట్టర్ టిల్లు బినామీ సంస్థ గ్లోబరీనా నిర్వాకం వల్ల 27 మంది ఇంటర్మీడియట్ విద్యార్థులు ఆత్మహత్య చేసుకుంటే కనికరం లేకుండా వాళ్ల తల్లిదండ్రులపై లాఠీఛార్జ్ చేయించిన ఘటనలు మర్చిపోగలమా? అని పేర్కొన్నారు. మీ బినామీ సంస్థ వల్ల అంత మంది ఇంటర్ విద్యార్థులు ఆత్మహత్య చేసుకుంటే ఎందుకు రాజీనామా చేయలేదని బీఆర్ఎస్ అగ్రనేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. ఇదే విషయంపై కేటీఆర్‌ను నిలదీయండి.. అప్పుడైనా బుద్ధి వస్తుందంటూ జెన్ జీ తరం పిల్లలకు కేంద్ర మంత్రి బండి సంజయ్ సూచించారు.

# కాళేశ్వరం బ్యారేజీల భవిష్యత్ నిర్వహణపై కేంద్రానికి లేఖ

మొదటి పేజీ తరువాయి

కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల భవిష్యత్ నిర్వహణపై కేంద్ర ప్రభుత్వానికి వెంటనే సమగ్ర నివేదిక పంపాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, జాతీయ డ్యామ్ భద్రతా అథారిటీ సూచించిన విధంగానే రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు మూడు బ్యారేజీలను నీటి నిల్వ లేకుండా విధానంలో నిర్వహిస్తోందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి ఈ. శ్రీధర్, టన్నెల్ నిపుణుడు కల్నల్ పరిక్షిత్ మెహ్రా, జాయింట్ సెక్రటరీ కె. శ్రీనివాస్ పాటు పలువురు సీనియర్ ఇంజినీర్లు, సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు. భవిష్యత్తులో నీటి నిల్వ, పంపింగ్ కార్యకలాపాలు ప్రారంభించాలా వద్దా అన్న అంశంపై కేవలం రాజకీయ ఒత్తిళ్లు లేదా పైకి కనిపించే పరిస్థితుల ఆధారంగా కాకుండా, అర్హత కలిగిన సాంకేతిక సంస్థల లిఖితపూర్వక సిఫారసుల ఆధారంగానే నిర్ణయం తీసుకుంటామని మంత్రి తేల్చిచెప్పారు. జల్ శక్తి మంత్రిత్వ శాఖకు పంపే లేఖలో ఎన్‌డీఎస్‌ఏ నివేదికలోని కీలక సిఫారసులు, గత సాంకేతిక పరిశీలనల వివరాలు, కేంద్ర జల సంఘం నివేదికలు, గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్ పరీక్షల ఫలితాలు, రాఫ్ట్ ఫౌండేషన్ కింద గుర్తించిన ఖాళీల వివరాలు, ఫోటోలు, ఇతర ఇంజినీరింగ్ ఆధారాలు అన్నింటినీ జతచేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. బ్యారేజీలను ఎందుకు నీటి నిల్వకు, పంపింగ్‌కు వినియోగించడం లేదన్న విషయాన్ని పూర్తి సాంకేతిక ఆధారాలతో కేంద్రానికి వివరించి, సమర్థ సాంకేతిక సంస్థల నుంచి అధికారిక అభిప్రాయం కోరాలి. ప్రభుత్వ నిర్ణయం మొత్తం అధికారిక రికార్డులో ఉండాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించారు. జల్ శక్తి మంత్రిత్వ శాఖలోని ఉన్నతాధికారులకు వెంటనే అందేలా రాష్ట్ర ప్రభుత్వ రెసిడెంట్ కమిషనర్ ద్వారా లేఖను స్వయంగా అందజేయాలని కూడా మంత్రి ఆదేశించారు. సమీక్ష సందర్భంగా అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం, ఇటీవల కేంద్ర జల్ శక్తి మంత్రి చేసిన ప్రకటనలు, మంత్రిత్వ శాఖ నుంచి వచ్చిన లేఖలు సాధారణంగా రాష్ట్ర ప్రభుత్వాలే బ్యారేజీల నిర్వహణపై నిర్ణయం తీసుకోవాలని పేర్కొన్నప్పటికీ, ఎన్‌డీఎస్‌ఏ నివేదికలో స్పష్టంగా సూచించిన 'ఫ్రీ-ఫ్లో విధానంలో కొనసాగించాలి' అనే అంశంపై ప్రత్యేకంగా ఎలాంటి మార్గదర్శకాలు ఇవ్వలేదని వివరించారు. మంత్రి మాట్లాడుతూ, కాళేశ్వరం బ్యారేజీలపై జరుగుతున్న ప్రతి శాస్త్రీయ పరిశీలన, ప్రతి సాంకేతిక పరీక్ష కేంద్ర ప్రభుత్వం, ఎన్‌డీఎస్‌ఏ సూచనల ప్రకారమే నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజల భద్రత, నిర్మాణాల స్థిరత్వం, శాస్త్రీయ ప్రమాణాల విషయంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడదని స్పష్టం చేశారు. బ్యారేజీల పునరుద్ధరణ పనులపై జరిగిన సమీక్షలో అధికారులు మంత్రి దృష్టికి కీలక అంశాలను తీసుకువచ్చారు. సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ తాజా జీపీఆర్ పరీక్షలు, ఇతర సాంకేతిక సమాచారం విశ్లేషణను తుది దశకు తీసుకెళ్లిందని తెలిపారు. అలాగే అన్నారం బ్యారేజీ రాఫ్ట్ ఫౌండేషన్ కింద కూడా ఖాళీలు ఉన్నట్లు సూచించే సాంకేతిక ఆధారాలు లభించాయని, ప్రస్తుత పరిస్థితుల్లో అక్కడ కూడా నీటిని నిల్వ చేయడం సురక్షితం కాదని అధికారులు వివరించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న అధ్యయనాల ఆధారంగా మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధరణ కాన్సెప్ట్ డిజైన్ ఈ ఆగస్టు నెలాఖరులోగా సిద్ధమవుతుందని, మధ్య సెప్టెంబర్ నాటికి ప్రాథమిక వ్యయ అంచనాలు కూడా సిద్ధం కానున్నాయని అధికారులు తెలిపారు.

న్నారం, సుందిళ్ల బ్యారేజీలకు సంబంధించిన అదనపు సాంకేతిక విశ్లేషణలు మరో రెండు వారాల్లో పూర్తవుతాయని వెల్లడించారు. అనంతరం వాటిని టెక్నికల్ ఓవర్‌సైట్ కమిటీ ముందు ఉంచాలని మంత్రి ఆదేశించారు. పంపింగ్‌కు అవసరమైన అప్‌స్ట్రీమ్ నీటి మట్టం ప్రస్తుతం కొనసాగించే పరిస్థితి లేదని, తాత్కాలిక ఏర్పాట్లతో పంపింగ్‌కు ప్రయత్నించడం వల్ల ఫలితం లేకపోవడమే కాకుండా బ్యారేజీల కింద ఉన్న నిర్మాణ సమస్యలు మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉందని వివరించారు. దీనిపై మంత్రి స్పందిస్తూ, 'కాళేశ్వరం బ్యారేజీల విషయంలో ఒక్క అడుగు కూడా రాజకీయ ఒత్తిళ్లతో వేయం. ప్రతి నిర్ణయం శాస్త్రీయ ఆధారాలు, ఇంజినీరింగ్ ప్రమాణాలు, నిపుణుల సిఫారసుల మీదే ఆధారపడి ఉంటుంది. ప్రజల భద్రతే ప్రభుత్వానికి అత్యున్నత ప్రాధాన్యం' అని స్పష్టం చేశారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పురోగతిపైనా మంత్రి సమీక్ష నిర్వహించారు.

## గ్లోబరీనా సంస్థ నిర్వాకంతో 28మంది బలి

మొదటి పేజీ తరువాయి

28 మంది విద్యార్థుల ప్రాణాలు పోయేందుకు ఆ సంస్థ కారణం కాదా? అని ప్రశ్నించారు. గాంధీ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కనీసం బర్త్‌డే రోజైనా కెటిఆర్ అబద్ధాలు మాట్లాడకుండా ఉంటే మంచిదన్నారు. గ్లోబరీనా సంస్థ రిపోర్టును బీఆర్ఎస్ ప్రభుత్వం ఎందుకు బయటపెట్టలేదన్నారు. దీని వెనుక కేటీఆర్ హస్తం ఉన్నట్లు అనుమానాలు ఉన్నాయి. నీట్ పేపర్ లీకైన నెలన్నరకు ఆయన నిద్రలేచారని మహేశ్‌కుమార్‌గౌడ్ విమర్శించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పుట్టిన రోజు సందర్భంగా టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ శుభాకాంక్షలు తెలిపారు. పుట్టినరోజు నాడైనా కేటీఆర్ నిజాలు మాట్లాడాలని సూచించారు. నల్ల చొక్కాలు వేసుకున్నంత మాత్రాన ప్రజలు నమ్మరన్నారు. కపట ప్రేమలు, నల్లచొక్కా డ్రామాలు నడవవని చెప్పుకొచ్చారు. 'రేవంత్ ఢిల్లీకి వెళ్తే ఏంటి? వెళ్లకపోతే ఏంటి?.. కొడంగల్‌లో నిరసన చేశారు' అని అన్నారు. విద్యార్థుల ఉద్యమంపై కేసీఆర్ ఇప్పటిదాకా ఒక్క స్టేట్‌మెంట్ ఇవ్వలేదని విమర్శించారు. కేసీఆర్ ఎత్తేసిన ధర్నా చౌక్‌లో కేటీఆర్ ధర్నా చేశారని.. ధర్నా చేసే హక్కు ఆయనకు ఎక్కడిదని ప్రశ్నించారు. కేటీఆర్ ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాక ధర్నా చేస్తే బాగుంటుందని మహేష్ వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వ హయాంలో చనిపోయిన ప్రతి ఒక్కరికీ బీఆర్ఎస్ అకౌంట్ నుంచి రూ.2 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 27 మంది విద్యార్థుల మరణానికి కారణం గ్లోబరీనా సంస్థ అని ఆరోపించారు. 2011లో జరిగిన గ్లోబరీనా అంశంలో నివేదిక ఎందుకు బయటపెట్టలేదని ప్రశ్నించారు. 'గ్లోబరీనాపై విచారణకు కేటీఆర్ ఫిర్యాదు చేయాలి. మాకు మేముగా విచారణ చేస్తే కక్ష సాధింపు అంటారు' అని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో పేపర్ లీక్‌లు అందరికీ తెలుసని అన్నారు. ఇసుక వ్యాపారంతో ఎంతోమంది చావులకు కారణం కేటీఆర్ అని ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు వేర్వేరు కాదని.. రెండూ ఒకటే అనడానికి బలమైన కారణాలు ఉన్నాయని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు

## 20 ఏళ్లకు సరిపడా బొగ్గు నిల్వలు

మొదటి పేజీ తరువాయి

గతంలో జరిగిన పొరపాట్లు మళ్లీ పునరావృతం కాకుండా తమ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని స్పష్టం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు ఓపెన్ కాస్ట్ బొగ్గు గనిని భట్టితదితరులు క్షేత్రస్థాయిలో పరిశీలించడం జరిగింది. గనిలోకి స్వయంగా వెళ్లి బొగ్గు నాణ్యతను పరిశీలించి, బొగ్గు ఉత్పత్తి, గని పనితీరుపై అధికారులతో సమీక్ష నిర్వహించాను. రాష్ట్ర భవిష్యత్ ఇంధన అవసరాలను దృష్టిలో ఉంచుకుని, వేలం పక్రియలో చురుగ్గా పాల్గొని కొత్త బొగ్గు బ్లాకులను సొంతం చేసుకోవాలని సింగరేణి అధికారులను ఆదేశించారు. తాడిచెర్ల బొగ్గు బ్లాక్ సింగరేణికి కేటాయించడం శుభపరిణామం. అలాగే భవిష్యత్ అవసరాల దృష్ట్యా పీకే ఓసీ డిప్ సైడ్ బ్లాక్ కూడా సింగరేణికే దక్కేలా మన ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుందని హామీ ఇస్తున్నట్లు వెల్లడించారు. సింగరేణి ప్రయోజనాల పరిరక్షణెలి మన ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని భట్టి అన్నారు.

## మా జోలికి వస్తే రాజకీయ సమాధి తప్పదు

మొదటి పేజీ తరువాయి

నల్లగొండ జిల్లా ఎవరి రాజ్యమూ కాదని, ఇది శ్రమజీవుల జిల్లా అని స్పష్టం చేస్తూ, తనతో పాటు నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రజల అభిమానంతోనే గెలిచి అసెంబ్లీలో అడుగుపెట్టామని ధీమా వ్యక్తం చేశారు. తన నియోజకవర్గంలో తనకు సమాచారం లేకుండా పర్యటించడంపై ఎమ్మెల్యే మందుల సామేల్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తుంగతుర్తికి ఒక ఎమ్మెల్యే ఉన్నాడనే విషయం మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి తెలియడం లేదు. స్థానిక శాసనసభ్యుడినైన నాకు తెలియకుండా నా నియోజకవర్గానికి ఎలా వస్తారు? కనీస ప్రోటోకాల్ పాటించరా?' అని ప్రశ్నించారు. కోమటిరెడ్డికి ఎస్సీ నియోజకవర్గాలంటే చిన్నచూపని, మాదిగలపై వివక్ష చూపిస్తున్నారని ఆరోపించారు. మాదిగలు ఎవరికీ బానిసలు కాదని స్పష్టం చేసిన ఆయన, ఇదే తరహా పద్ధతి కొనసాగితే ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తమ గౌరవానికి భంగం కలిగిస్తే ఊరుకునేది లేదని, అంతకు అంత ప్రతికారం తీర్చుకుంటామని సామేల్ హెచ్చరించారు. ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డిపై కూడా మందుల సామేల్ తీవ్రంగా విరుచుకుపడ్డారు. గతంలో కాంగ్రెస్‌ను వీడి బీజేపీలోకి ఎందుకు వెళ్లారో రాజగోపాల్ రెడ్డి ముందుగా సమాధానం చెప్పాలని నిలదీశారు. మునుగోడు నియోజకవర్గంలో రాజగోపాల్ రెడ్డి తీరుపై తమకు పూర్తి రిపోర్టు వచ్చిందని వ్యాఖ్యానించారు. నాయకులు తమ నియోజకవర్గాలపై దృష్టి సారిస్తే మంచిదని, ఎస్సీ స్థానాలైన తమ సీట్లపై ఇతరుల పెత్తనం ఏంటని ఆయన తీవ్రంగా ప్రశ్నించారు. సూర్యాపేట జిల్లా నాగారం మండలం వర్ధమానుకోట గ్రామం 5 లక్షల రూపాయలతో నిర్మించిన వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవంతో పాటు 12 లక్షల రూపాయల తో నూతనంగా నిర్మించిన అంగన్వాడీ కేంద్రం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే సామ్యూల్ పాల్గొన్నారు. 6 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన ఆరోగ్య స్వస్థత కేంద్రం ప్రారంభోత్సవం కార్యక్రమనికి ముఖ్య అతిదులుగా వచ్చి ప్రారంభోత్సవ కార్యక్రమం పాల్గొన్నారు. కార్యక్రమంలో వర్ధమాన్ కోట గ్రామ సర్పంచ్ బుచ్చి బాబు ,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట బిక్షం ,మండల కాంగ్రెస్ నాయకులు మండల సర్పంచులు కార్యకర్తలు అభిమానులు పాల్గొనడం జరిగింది.

## బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య

మొదటి పేజీ తరువాయి

ఈ ఘటనకు సంబంధించి వివరాలు తెలియాల్సి ఉంది. ఇదిలా ఉంచితే, మణికొండలో అపార్ట్‌మెంట్ 10వ అంతస్తునుంచి దూకి ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ సంఘటన ఫైనాన్షియల్ జిల్లా పుప్పాలగూడలో జరిగింది. నార్సింగి పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు.. జేపీ మోర్గాన్ చేజ్ అనే ఐటీ సంస్థలో మబ్బు విష్ణువర్దన్‌రెడ్డి(27) సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు.బుధవారం రాత్రి విధులు ముగించుకుని ఏఎస్‌బీఎల్ స్పెక్ట్రా అపార్ట్‌మెంట్ 10వ అంతస్తులోని తన ఫ్లాట్‌కు వచ్చి పడుకున్నాడు. అయితే గురువారం తెల్లవారు జామున గ్రౌండ్ ఫ్లోర్‌లో అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని కుటుంబ సభ్యులు గుర్తించారు. పోలీసులు వెళ్లి చూడగా అప్పటికే మరణించినట్టు నిర్ధారించారు.

# ఢిల్లీలో విద్యార్థుల పై దాడులను తీవ్రంగా ఖండిస్తున్నాం



ప్రజా సంఘాల నాయకులు నిరసన, ర్యాలీ

**కరపత్రం ప్రతినిధి నకరికల్లు, జూలై 24 :**
ఢిల్లీలో విద్యార్థులపై దాడులను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పలువురు ప్రజా సంఘాల నాయకులు తెలిపారు. నీట్ పరీక్ష పత్రం లీకేజీ పై చర్యలు తీసుకోవాలంటూ ఢిల్లీలో విద్యార్థుల నిరసనకు మద్దతుగా పల్నాడు జిల్లా నకరికల్లు లో పలు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం సంఘీభావ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం సెంటర్ నుంచి ఉన్నత పాఠశాల వరకు నినాదాలు చేసుకుంటూ ర్యాలీగా తరలి వెళ్లారు. అనంతరం ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ, 1).కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ రాజీనామా చేయాలన్నారు. 2).నీట్ పేపర్ లీకేజీ లో బాధ్యులను శిక్షించాలన్నారు. 3).ఆత్మహత్య చేసుకున్న విద్యార్థి కుటుంబాలను ఆదుకోవాలన్నారు. 4).డిల్లీ లో విద్యార్థుల పై జరిగిన లాఠీ చార్జి ని ఖండిస్తున్నట్లు తెలిపారు. 5).విద్యార్థుల పై పెట్టిన కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. 6).విద్యార్థుల తో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరపాలని, 7).విద్యార్థినులపై మగ పోలీసులు జరిపిన దౌర్జన్యం పై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం లో కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జి. పిచ్చా రావు, పిడిఎం జిల్లా కార్యదర్శి షేక్ మస్తాన్ వలి, ఎం సిపిఐయు మహిళా విభాగం జిల్లా కార్యదర్శి గాదె కుమారి, బీసి విభాగం చల్లా శ్రీనివాసరావు, గిరిజన సంఘం నాయకుడు సభావత్ రామాంజి నాయక్, పీడీఎం సభ్యుడు షేక్.లాలు తదితరులు పాల్గొన్నారు.

# దుర్గాభవానీ అమ్మవారికి క్యారేట్ మాలలతో అలంకరణ



- విశేష హారతులు ఇస్తున్న ఆలయ ప్రధానార్చకులు పవనకృష్ణ శర్మ
- అమ్మవారికి చీరే, సారే సమర్పించిన అన్నమయ్య సేవా సభ్యులు

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్**



కరీంనగర్ నగునూర్‌లోని శ్రీదుర్గాభవానీ ఆలయంలో జరుగుతున్న ఆషాడమాసం శాకంబరీ ఉత్సవాలలో భాగంగా పదవ రోజైనా శుక్రవారం శ్రీదుర్గాభవానీ అమ్మవారిని క్యారేట్ మాలలతో అలంకరించారు. అమ్మవారికి ఆలయ ప్రధానార్చకులు పవనకష్ణ శర్మ విశేష హారతులు, ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు. అన్నమయ్య సేవా అధ్యక్షురాలు మమతారెడ్డి ఆధ్వర్యంలో సభ్యులు శోభయాత్రతో కోలాటలతో వచ్చి అమ్మవారికి ఓడిబియ్యం పోసి చీరే, సారే సమర్పించారు. ఈ పూజల్లో ఆలయ ఫౌండర్ చైర్మెన్ వంగల లక్ష్మన్, ఆలయ కమిటి బాధ్యులు వేములవాడ ద్రోణాచారితోపాటు భక్తులు పాల్గోన్నారు.

## కూటమి ప్రభుత్వంలో తల్లికి వందనం విజయవంతం

### పిడుగురాళ్ల పట్టణ టిడిపి అధ్యక్షులు పిల్లి చెన్నారావు వెల్లడి




**కరపత్రం ప్రతినిధి పిడుగురాళ్ల, జూలై 24 :**
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం (మెగా పీటీఎం 4.0 ) విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి, పిడుగురాళ్ల పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ పాఠశాల ప్రగతికి ఒక వేదికగా నిలిచింది. ఈ కార్యక్రమం హైస్కూల్ హెడ్ మాస్టర్ కొత్త మల్లిఖార్జునరావు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమం ద్వారా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, టీడీపీ నాయకులు ఒక్కచోట చేరి పిల్లల భవితపై చర్చించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కొత్త మల్లికార్జునరావు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తల్లికి వందనం కార్యక్రమం విజయవంతంగా ప్రతి విద్యార్థికి వారి ఖాతాలో రూ.13 వేల రూపాయలు జమ చేయటం ఆనందించదగ్గ విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పిల్లి చెన్నారావు, ఎస్ఎంసి చైర్మన్ బాలకృష్ణ, టీడీపీ జిల్లా ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్ అమిర్ అలీ,టీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షులు కనిగిరి శ్రీను, సర్వేశ్వరరావు, జనసేన నాయకులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, విశ్రాంత ఉపాధ్యాయులు విజయ సారధి, పేరెంట్స్ నుండి కిరణ్మయి, తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేయడం జరిగింది.

# నీట్ అక్రమాలపై గళమెత్తిన విద్యార్థుల డిమాండ్లను నెరవేర్చాలి

- నిర్బంధాలతో గొంతు నొక్కలేరు.. విద్యార్థుల భవిష్యత్తో చెలగాటమాడవద్దు
- ప్రజా సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షులు పోలాడి రామారావు

**కరపత్రం ప్రతినిధి-కరీంనగర్:**
నీట్ పేపర్ లీకేజీపై ప్రజాస్వామ్యయుతంగా శాంతియుతంగా చేస్తున్న విద్యార్థుల ఆందోళనపై పాలక ప్రతిపక్షాలు రాజకీయాలు మానుకోవాలని, విద్యార్థుల భవిష్యత్ తో చెలగాటమాడవద్దని ప్రజా సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షులు పోలాడి రామారావు అన్నారు. ఎన్నో ఏళ్లుగా కష్టపడి చదివిన విద్యార్థుల ఆశలు, వారి తల్లిదండ్రుల కలలు ప్రశ్నాపత్రాల లీకేజీలతో ఒక్కసారిగా ప్రశ్నార్థకంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. నీట్ పరీక్షలో జరిగిన తప్పుల కారణంగా 23 మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని, లక్షలాది మంది విద్యార్థులు నష్టపోయారన్నారు. అనేక మంది విద్యార్థులు, యువకులు ఆవేదనకు గురై భవిష్యత్ అభద్రత భావానికి లోనై ఆందోళన చెందుతున్నారన్నారు. శుక్రవారం కరీంనగర్ లో విద్యార్థుల దేశవ్యాప్త నిరసనకు సంఘీభావంగా నిర్వహించిన విద్యార్థి, యువజన, ప్రజాసంఘాల సమావేశంలో పోలాడి రామారావు మాట్లాడారు. ఇది కేవలం ఒక పరీక్షలో జరిగిన తప్పిదం కాదని, దేశ విద్యా వ్యవస్థ విశ్వసనీయతపై పడిన మచ్చగా మిగిలిందన్నారు. దీంతో విద్యార్థులు, యువతీ యువకులు, విద్యావేత్తలు, ప్రజా సంఘాల ప్రతినిధులు ఛలో పార్లమెంట్ నిర్వహించారన్నారు. ప్రశ్నాపత్రాల లీకేజీకి నిరసనగా నాణ్యమైన విద్య, మెరుగైన పరీక్ష విధానం కోసం ఢిల్లీలో గళమెత్తిన విద్యార్థులపై లాఠీలు, బాష్పవాయువులతో కేంద్ర సర్కార్ కర్కషంగా అణిచివేత, దమనకాండకు పాల్పడడాన్ని ప్రజా సంఘాల తరపున తీవ్రంగా ఖండిస్తున్నట్లు రానారావు తెలిపారు. నిర్బంధాలతో గొంతు నొక్కలేరని అన్నారు. విద్యార్థుల న్యాయమైన ఆందోళనలపై పాలకుల ఉదాసీనత, అలసత్వమే దేశ రాజధానిలో యువత, విద్యార్థుల ఉద్యమం తారస్థాయికి చేరిందన్నారు. ప్రజాస్వామ్యంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై విచక్షణా రహితంగా దాడి చేసిన పోలీసులపై కఠిన చర్యలు గైకొని, కేసులు ఎత్తివేసి విద్యార్థులకు పాలకులు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని, ఆత్మహత్య చేసుకున్న విద్యార్థులకు కోటి రూపాయల చొప్పున ఎక్స్ గ్రేషియా ప్రకటించాలని పోలాడి రామారావు డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్మెంట్, మెస్ చార్జీలు, స్కాలర్షిప్ లు సకాలంలో చెల్లింపులు చేయాలని, ప్రవేశ పరీక్షలు, ఉద్యోగాలలో లోటుపాట్లు లేకుండా వకడ్బందీగా చేయాలని డిమాండ్ చేశారు.



కేంద్ర, రాష్ట్రాల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీలో పాలకులు చేస్తున్న అలసత్వంపట్ల నిరుద్యోగ యువత వయోపరిమితి దాటి ఉద్యోగాలకు నోచుకోక నిరాశ నిస్పృహకు లోనవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు . పాలకులు తక్షణమే చర్యలు గైకొనకపోతే యువత ఆగ్రహానికి గురై మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఇదే అదనుగా ప్రేరేపిత ఆంటీ సోషల్ ఎలిమెంట్ల పట్ల ప్రభుత్వం అప్రమత్తంగా ఉండాలని కోరారు ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు కన్నం లక్ష్మణ్,కూరతోట సురేందర్, కల్వకుంట్ల వంశీధర్ రావు, బండ సుధాకర్ రెడ్డి, జనగామ కరుణాకర్ రావు,పిన్నింటి లక్ష్మణ్ కుమార్, జంపాల బాబు , పోల్సాని సునీల్,కనపర్తి సాయి,మిరుదొడ్డి అనిల్,భరత్, మంద మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి డివిజన్‌లో సమగ్ర అభివృద్ధే లక్ష్యం -- నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్**
కరీంనగర్ నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు నగరపాలక సంస్థ కట్టుబడి పనిచేస్తోందని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా ప్రతి డివిజన్‌లో అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. కరీంనగర్ నగరపాలక సంస్థ 25వ డివిజన్ సుభాష్‌నగర్ లో మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు , సీసీ డ్రెయిన్ నిర్మాణ పనులకు మేయర్ శంకుస్థాపన చేశారు. అనంతరం 12వ డివిజన్ రామచంద్రపూర్ కాలనీ లో మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు , తాగునీటి పైప్‌లైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటికి శాశ్వత పరిష్కారం చూపే దిశగా అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. వర్షాకాలంలో నీరు నిల్వ ఉండకుండా సీసీ డ్రెయిన్ల నిర్మాణం, ప్రజలు సౌకర్యవంతంగా రాకపోకలు సాగించేలా నాణ్యమైన సీసీ రోడ్ల నిర్మాణం, ప్రతి ఇంటికి తాగునీరు అందేలా



పైప్‌లైన్ వ్యవస్థను బలోపేతం చేయడం వంటి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు అనుగుణంగా కరీంనగర్ నగరంలోనూ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. నగర అభివృద్ధిలో ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమని, చేపట్టిన పనులను సంరక్షిస్తూ పరిశుభ్రమైన పరిసరాలను కాపాడాలని పిలుపునిచ్చారు.అభివృద్ధి పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టి నిర్ణీత గడువులో పనులను



పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మేయర్ ఆదేశించారు. నగరంలోని ప్రతి డివిజన్‌లో ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి పనులు కూడా దశలవారీగా చేపడతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, 25వ డివిజన్ కార్పొరేటర్ గంట శ్రీనివాస్, 12వ డివిజన్ కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ, మున్సిపల్ అధికారులు, బీజేపీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీవాసులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నరసరావుపేటలో మెగా పీటీఎం విజయవంతం

విద్యార్థుల భవిష్యత్‌కు తల్లిదండ్రులు--ఉపాధ్యాయుల భాగస్వామ్యం కీలకం
నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు

**కరపత్రం ప్రతినిధి నరసరావుపేట, జూలై 24:**
పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా పేరెంట్--టీచర్ మీటింగ్ కార్యక్రమాలు నరసరావుపేట నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం ఉత్సాహంగా జరిగాయి. ఈ కార్యక్రమాలకు నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో ఆత్మీయంగా సమావేశమయ్యారు. ఎమ్మెల్యే నరసరావుపేట పట్టణంలోని 5వ వార్డు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ మున్సిపల్ హైస్కూల్, అనంతరం మున్సిపల్ బాయ్స్ హైస్కూల్, మున్సిపల్ గర్ల్స్ హైస్కూల్, తర్వాత యలమంద జెడ్పీ హైస్కూల్, కోటప్పకొండ జెడ్పీ హైస్కూల్, ఎస్ ఎస్ ఎన్ డిగ్రీ కళాశాల నందు, ప్రకాష్ నగర్ లోని తిలక్ స్కూల్ నందు, క్రిస్టియన్ పాలెం శ్రీ అంబేద్కర్ మున్సిపల్ హై స్కూల్ నందు, భరంపేట లోని ఎస్ భి ఆర్ హైస్కూల్ నందు నిర్వహించిన మెగా పీటీఎం కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే కి పాఠశాల విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే ఉత్సాహంగా పాల్గొన్నారు. నృత్య ప్రదర్శన నిర్వహించారు. ప్రతి పాఠశాలలో విద్యార్థుల విద్యా ప్రగతి, హాజరు, అభ్యాస నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసం తదితర అంశాలపై తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు విస్తృతంగా చర్చించారు. పెద్ద



సంఖ్యలో తల్లిదండ్రులు హాజరై విద్యార్థుల అభివృద్ధిపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ, పిల్లల విద్యలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమాన భాగస్వాములని అన్నారు. ఈ ఇద్దరి సమన్వయంతోనే విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యున్నత ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థుల సంక్షేమానికి అనేక పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని చెప్పారు.తల్లికి వందనం, విద్యార్థులకు ఉచిత విద్యా కిట్లు, పాఠశాల బ్యాగులు, నాణ్యమైన మధ్యాహ్న భోజన పథకం, పాఠశాలల్లో మెరుగైన మౌలిక వసతులు, డిజిటల్ విద్య వంటి కార్యక్రమాల ద్వారా ప్రతి విద్యార్థికి మెరుగైన విద్య అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలను పూర్తిస్థాయిలో పొందాలని ఆకాంక్షించారు.అలాగే తల్లికి వందనం పథకానికి అర్హత ఉన్నప్పటికీ ఎవరికైనా నిధులు జమ కాకపోతే వెంటనే నా దృష్టికి



తీసుకురండి. సంబంధిత అధికారులతో పాటు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి అర్హులైన ప్రతి తల్లికి 'తల్లికి వందనం' నిధులు అందేలా చర్యలు తీసుకుంటాను అని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.అర్హులైన ఒక్క కుటుంబం కూడా ఈ పథకానికి దూరం కాకూడదని, దీనిపై అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ప్రతి అర్హురాలైన తల్లికి ప్రభుత్వ సంక్షేమ పథకం చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత, వేగం ఉండాలని అధికారులను ఆదేశించారు. తల్లిదండ్రులు తమ పిల్లల చదువుపై నిరంతరం శ్రద్ధ వహించాలని, ప్రతిరోజూ వారి అభ్యాసాన్ని పరిశీలిస్తూ ఉపాధ్యాయులతో తరచూ సంప్రదింపులు జరపాలని ఎమ్మెల్యే కోరారు. విద్యార్థుల ప్రతిభను వెలికితీసి, మంచి పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని ఆయన అన్నారు.కార్యక్రమాల్లో నాయకులు, నాగసరపు సుబ్బరాయ గుప్తా, కపిలవాయి విజయ్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పాఠశాల నిర్వహణ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కేటీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించిన బీఆర్ఎస్ నాయకులు

పాడి కౌశిక్ రెడ్డి ఆదేశాల మేరకు జమ్మికుంటలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, జూలై 24:**
హుజూరాబాద్ శాసనసభ్యులు పాడి కౌశిక్ రెడ్డి ఆదేశాల మేరకు కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణ మున్సిపల్ పరిధిలోని స్థానిక గాంధీ చౌరస్తాలో తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు.జమ్మికుంట మున్సిపల్ మాజీ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు కేటీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, తెలంగాణ అభివృద్ధిలో కేటీఆర్ కీలక పాత్ర పోషించారని, ఐటీ, పారిశ్రామిక రంగాల అభివృద్ధితో పాటు రాష్ట్ర ప్రగతికి విశేష కృషి చేశారని కొనియాడారు. ఆయనకు ఆయురారోగ్యాలు కలిగి, ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, పొనగంటి సంపత్, కొత్తపల్లి మాజీ సర్పంచ్ బొద్దుల రవీందర్, భోగం వెంకటేష్, దయ్యాల శ్రీనివాస్, ముద్రగడ నవీన్ కుమార్, పాతకాల ఓదెలు, పొనగంటి సందీప్, శ్రీధర్, సతీష్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



## సూర్జిత్ నగర్‌లో రోడ్లు, డ్రైనేజీ పనులు వెంటనే పూర్తి చేయాలి: సీపీఎం డిమాండ్

- అసంపూర్తి పనులతో వర్షాకాలంలో కాలనీవాసులకు తీవ్ర ఇబ్బందులు
- పనులు పూర్తి చేయకపోతే కాలనీవాసులతో కలిసి ఆందోళనలు చేపడతామని హెచ్చరిక



**కరపత్రం ప్రతినిధి వరంగల్, జూలై 24**
హనుమకొండ జిల్లా న్యూ శాయంపేట 31వ డివిజన్ పరిధిలోని సూర్జిత్ నగర్‌లో సీపీఎం జిల్లా కమిటీ పిలుపు మేరకు శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల సర్వేలో కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పార్టీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకుడు కారు ఉపేందర్ మాట్లాడుతూ.. కాలనీలో రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలకు నిధులు మంజూరై పనులు ప్రారంభమైనప్పటికీ కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో కేవలం మట్టి వేసి పనులను మధ్యలోనే నిలిపివేశారని ఆరోపించారు.
దీంతో వర్షాకాలంలో డాక్టర్స్ కాలనీతో పాటు పరిసర ప్రాంతాల నుంచి వచ్చే వర్షపు నీరు లోతట్టు ప్రాంతమైన సూర్జిత్ నగర్‌లోకి చేరి ఇండ్లలోకి ప్రవేశిస్తోందన్నారు. దీంతో నిత్యావసర సరుకులు, గృహోపకరణాలు తడిసి కాలనీవాసులు తీవ్ర ఆర్థిక నష్టాన్ని చవిచూస్తున్నారని తెలిపారు. రోడ్లు, డ్రైనేజీ పనులు పూర్తవుతాయని ఆశించిన ప్రజలకు తీవ్ర నిరాశ ఎదురైందని, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.
అదే విధంగా అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, ఇంటి స్థలం లేని వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు అందించాలని కోరారు. అర్హులందరికీ పింఛన్లు, రేషన్ కార్డులు మంజూరు చేయడంతో పాటు యువతకు ప్రభుత్వ రుణాల ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. వర్షాకాలంలో ప్రజలు వ్యాధుల బారిన పడకుండా దోమల నివారణ చర్యలు చేపట్టి, ప్రత్యేక ఆరోగ్య శిబిరాలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజల సమస్యలను అధికారులు నిర్లక్ష్యం చేస్తే కాలనీవాసులందరినీ ఐక్యం చేసి సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ సర్వేలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కురుకు రంజిత్, పార్టీ శాఖ కార్యదర్శులు ధర్నా ప్రభాకర్, వంగ సదానందం, ఎండీ షర్ఫుద్దీన్, లాసాని గోపాల్, అచ్చునూరి ఐలయ్య, ఎర్ర అంజమ్మ, కోర్ర బేబీ, రాధిక తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి విద్యార్థికి రెండు జతల యూనిఫార్మ్‌లు అందించాలి

- నెల రోజుల్లోగా యూనిఫామ్‌ల పంపిణీ పూర్తి చేయాలి
- ఎల్‌నినో ప్రభావంతో ప్రత్యామ్నాయ చర్యలకు దిగాలి
- జిల్లా కలెక్టర్లతో సిఎస్ వీడియో కాన్ఫరెన్స్

**కరపత్రం ప్రతినిధి హైదరాబాద్,జూలై 24 :**
ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్రంలోని ప్రభుత్వ స్కూళ్ళు, రెసిడెన్షియల్ పాఠశాలలోని ప్రతి విద్యార్థికి రెండు జతల యూనిఫార్మ్ ల చొప్పున నెలరోజుల్లోగా యూనిఫారం లను అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను అధికారులను ఆదేశించారు. స్కూల్ యూనిఫామ్ ల తయారీ, పంపిణీ, ఎల్-నినో నేపథ్యంలో చేపట్టిన ప్రత్యామ్నాయ ప్రణాళికపై శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుండి సిఎస్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. యూనిఫామ్ లను కుట్టించడానికి 26 వేలమంది స్వయంసహాయక బృందాల మహిళలను గుర్తించామని అధికారులు తెలిపారు. స్కూల్ యూనిఫామ్ ల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడొద్దని, విద్యార్థులకు అందిన స్కూల్ డ్రెస్ లు, షూస్ తదితర స్కూల్ కిట్స్ ల నాణ్యతపై నేరుగా పాఠశాల విద్యార్థుల నుండే ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారని సిఎస్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. సకాలంలో యూనిఫామ్ లను కుట్టించడమే లక్ష్యంగా పెట్టుకోవాలని, దీనిపై జిల్లా, మండల స్థాయి పర్యవేక్షణ కమిటీలను ఏర్పాటు చేసుకొని నిరంతరం పర్యవేక్షించాలని ఆయా జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఐఎండి నివేదికల ప్రకారం దేశంలోనే ఎల్-నినో ప్రభావం అధికంగా ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణా ఒకటని, ఇప్పటివరకు రాష్ట్రంలో 27శాతం లోటు వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు. కేవలం 7 జిల్లాలో మాత్రమే సాధారణ వర్షపాతం నమోదైందని, మిగతా 385 మండల్లాల్లో లోటు వర్షపాతం ఉందన్నారు. వాతావరణ వివరాలను రాష్ట్రంలోని రైతులకు ఎప్పటికప్పుడు వాట్సాప్ ద్వారా సమాచారం అందిస్తున్నామని తెలిపారు. కర్ణాటక, మహారాష్ట్ర లలో కూడా వర్షాలు ఆశాజనకంగా లేవని, ప్రస్తుతం మేజర్ రిజర్వాయర్లలో ఉన్న నీటిని
తాగునీటికి నిల్వ చేస్తున్నామని, ఈ నేపథ్యంలో రైతులు వరి మినహా ఇతర ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలన్నారు. ఇప్పటి వరకు వరి సాగు 24 శాతం కంటే తక్కువ నమోదైందన్నారు. సెప్టెంబర్ మాసంలోనూ వర్షాలు అతి తక్కువగా ఉంటాయని భారత వాతావరణ శాఖ స్పష్టం చేసిందని తెలిపారు. వరికీ బదులుగా ఇతర ప్రత్యామ్నాయ పంటలపై రైతులను ప్రొత్సహించే విధంగా వాటి ఉత్పత్తులకు కనీస మద్దతు ధర లభిస్తున్నందున ఆ దిశగా రైతులను చైతన్య పర్చాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుత సీజన్ లో ఫామ్ పాండ్స్ ల నిర్మాణం విస్తృతంగా చేపట్టాలని సిఎస్ సూచించారు. ప్రతీ 45 రోజులకు ఒకసారి ఖచ్చితంగా మండల సమావేశాలను నిర్వహించే విధంగా సంబంధిత అధికారులు ప్రణాకళిలను రూపొందించుకోవాలని జిల్లా కలెక్టర్లను ఆయన ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో స్పెషల్ సిఎస్ లు సవ్యసాచి ఘోష్, దాన కిషోర్, నీటిపారుదల శాఖ కార్యదర్శి శ్రీధర్, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, డైరెక్టర్ గోపీ, పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్ దివ్య, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ లు పాల్గొన్నారు.

# బెల్లంపల్లి గురుకుల ఫుడ్ పాయిజన్ ఘటన

- టీజీహెచ్ఆర్సీ సుమోటో కేసు

డా. జస్టిస్ షమీమ్ అక్తర్ అధ్యక్షతన ఉన్న తెలంగాణ మానవ హక్కుల కమిషన్ బాలికల గురుకులంలో ఫుడ్ పాయిజన్' వార్తను సుమోటోగా స్వీకరించింది. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలోని బీసీ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినులు ఆహార విషబాధకు గురైన ఘటనపై సమగ్ర నివేదికను సమర్పించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్‌ను కమిషన్ ఆదేశించింది. ఈ కేసును నివేదిక కోసం ఆగస్ట్ 25కు వాయిదా వేసింది.

# కేంద్ర మంత్రి షెఖావత్ తో బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ ఫ్లోర్ లీడర్ ఎంపీ రవిచంద్ర భేటీ

- కలబ్‌గూర్, నందికండి ప్రాచీన దేవాలయాలను అభివృద్ధి చేసి జాతీయ పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దాలి
- కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెఖావత్ కు ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తో కలిసి విజ్ఞప్తి



**కరపత్రం ప్రతినిధి బ్యూరో, జూలై 24**
సంగారెడ్డి జిల్లాలోని సంగారెడ్డి మండలం కలబ్‌గూర్ గ్రామం, సదాశివపేట మండలం నందికండిలోని ప్రాచీన ఆలయాలను పరిరక్షించి, అభివృద్ధిపర్చి పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దాల్సిందిగా సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి శగజేంద్ర సింగ్ షెకావత్ కు విజ్ఞప్తి చేశారు.లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు.ఎమ్మెల్యే ప్రభాకర్ బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్రతో కలిసి ఢిల్లీలో శుక్రవారం మంత్రి షెఖావత్ తో భేటీ అయ్యారు. నందికండి దేవాలయం 11వ శతాబ్దానికి చెందిన చారిత్రక, శిల్పకళా వైభవాన్ని ప్రతిబింబించే అరుదైన కట్టడం అని, భారత పురావస్తు శాఖ (ఏఎస్ఐ) సంరక్షణలో ఉన్న చారిత్రక కట్టడంగా గుర్తింపు పొందిందని కేంద్ర మంత్రికి ప్రభాకర్ వివరించారు.దేశం నలుమూలల నుంచి భక్తులు, పర్యాటకులు, చరిత్ర పరిశోధకులు, వారసత్వ సంపదపై ఆసక్తి ఉన్నవారు ఈ ఆలయాన్ని సందర్శిస్తుంటారని తెలిపారు. అలాగే, కలబ్‌గూర్, నందికండి దేవాలయాలు చారిత్రక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక పరంగా ఎంతో ప్రాధాన్యం కలిగి ఉన్నప్పటికీ, మౌలిక సదుపాయాలు, పర్యాటక సౌకర్యాల కొరత కారణంగా అభివృద్ధి జరగడం లేదని పేర్కొన్నారు.ఈ దేవాలయాలను అభివృద్ధి చేస్తే రాష్ట్ర సాంస్కృతిక వారసత్వ పరిరక్షణతో పాటు ఆధ్యాత్మిక పర్యాటకానికి, ప్రాంతీయ సామాజిక-ఆర్థిక అభివృద్ధికి విశేషంగా దోహదపడుతుందని వినతిపత్రంలో ఎమ్మెల్యే ప్రభాకర్ వివరించారు.
ఈ నేపథ్యంలో భారత పురావస్తు శాఖ (ఏఎస్ఐ)తో పాటు సంబంధిత శాఖలకు ఆదేశాలు జారీ చేసి ఈ క్రింది పనులను ప్రాధాన్యతతో చేపట్టాలని కేంద్ర మంత్రిని కోరారు.
ప్రాచీన దేవాలయాల పరిరక్షణ, పునరుద్ధరణ పనులు చేపట్టడం.
దేవాలయ ప్రాంగణం, పరిసర ప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి చేయడం.
దేవాలయాలకు చేరుకునే రహదారులు, పార్కింగ్ సదుపాయాలు, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ దీపాలు, సుందరీకరణ పనులు చేపట్టడం.
దేవాలయ చరిత్రను వివరించే సమాచార బోర్డులు, పర్యాటక మార్గదర్శక సూచికలను ఏర్పాటు చేయడం.
కేంద్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలోని వారసత్వ, ఆధ్యాత్మిక పర్యాటక పథకాల కింద ఈ దేవాలయాలను ప్రోత్సహించడం.
ఈ చారిత్రక దేవాలయాల పరిరక్షణ, అభివృద్ధికి తగిన నిధులు మంజూరు చేయడం.
ఈ ప్రాచీన దేవాలయాలకు తగిన ప్రాధాన్యం కల్పించి, భక్తులు, పర్యాటకులు, భావితరాల కోసం వాటిని పరిరక్షించి అభివృద్ధి చేయాల్సిందిగా ప్రభాకర్ తన వినతిపత్రంలో పేర్కొన్నారు.
ఈ ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలించి, కలబ్‌గూర్, నందికండి ప్రాచీన దేవాలయాల అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేసి, పర్యాటక మౌలిక సదుపాయాలు కల్పించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాల్సిందిగా మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ కు ఎమ్మెల్యే ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. మంత్రి షెఖావత్ కు ఎంపీ రవిచంద్ర,జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శివకుమార్, భాస్కర్ లతో కలిసి శాసనసభ్యులు ప్రభాకర్ వినతిపత్రం అందజేశారు.

# శాయంపేటలో నీట్ వ్యవహారంపై కాంగ్రెస్ నిరసన

- ప్రశ్నాపత్రాల లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి
- విద్యార్థులపై లాఠీచార్జ్ చేసిన అధికారులపై చర్యలు తీసుకుని కేసులు ఉపసంహరించాలి
- హనుమకొండ డీసీసీ ఉపాధ్యక్షులు, శాయంపేట మండల ఇన్‌చార్జి అయ్యాల రాంరెడ్డి ఆధ్వర్యంలో..





**కరపత్రం ప్రతినిధి శాయంపేట, జూలై 24**
దేశ వ్యాప్తంగా నీట్ పరీక్షల నిర్వహణపై నెలకొన్న వివాదం, ప్రశ్నాపత్రాల లీకేజీ ఆరోపణలు, విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో ఏఐసీసీ, టీ-పీసీసీ పిలుపు మేరకు హనుమకొండ జిల్లా శాయంపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనం లోపించాయని ఆరోపిస్తూ కేంద్ర ప్రభుత్వ వైఖరిని కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. శుక్రవారం శాయంపేట అంబేద్కర్ సెంటర్ వద్ద హనుమకొండ డీసీసీ ఉపాధ్యక్షులు, శాయంపేట మండల ఇన్‌చార్జి అయ్యాల రాంరెడ్డి ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కార్యదర్శి కొయ్యడ సాంబయ్య, మాజీ జెడ్పీటీసీ చల్లా చక్రపాణి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని, విద్యార్థులపై అకారణంగా లాఠీచార్జ్ చేసిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థులపై నమోదు చేసిన కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అయ్యాల రాంరెడ్డి, నాయకులు మాట్లాడుతూ.. నీట్ వంటి అత్యంత కీలకమైన జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల్లో ప్రశ్నాపత్రాల లీకేజీ జరగడం లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడటమేనని అన్నారు. పరీక్షల నిర్వహణలో చోటుచేసుకున్న వైఫల్యాలకు కేంద్ర ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని, సంబంధిత మంత్రి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా విద్యార్థులు తమ న్యాయమైన హక్కుల కోసం శాంతియుతంగా నిరసనలు తెలుపుతుంటే వారిపై లాఠీచార్జ్ చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆయన విమర్శించారు. విద్యార్థుల గొంతును అణచివేసే చర్యలను కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోదని స్పష్టం చేశారు. పరీక్షల నిర్వహణలో సంపూర్ణ పారదర్శకతను తీసుకురావడంతో పాటు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో శాయంపేట మండల నాయకులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర మంత్రి గడ్కరీకి బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ ఫ్లోర్ లీడర్ ఎంపీ రవిచంద్ర వినతిపత్రం అందజేత

- నిజాంపూర్ ఎక్స్‌రోడ్డు, అరూర్ గ్రామ జంక్షన్‌ల వద్ద ఫ్లైఓవర్ల నిర్మించాల్సిందిగా కోరుతూ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తో కలిసి వినతి





**కరపత్రం ప్రతినిధి బ్యూరో, జూలై 24**
సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండల పరిధిలోని జాతీయ రహదారి-65పై నిజాంపూర్ ఎక్స్‌రోడ్డు, అరూర్ గ్రామ జంక్షన్ల వద్ద ఫ్లైఓవర్లు నిర్మించాల్సిందిగా సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ జైరాం గడ్కరీని కోరారు.
నిజాంపూర్ ఎక్స్‌రోడ్డు ముబారక్‌పూర్, వెల్టూర్, నిజాంపూర్, కొల్కూర్, పోతిపల్లి, మాచిరెడ్డిపల్లి తదితర గ్రామాలను అనుసంధానించే ప్రధాన కూడలిగా ఉందన్నారు.ఢిల్లీలో శుక్రవారం బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్రతో కలిసి ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మాణిక్ రావు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శివకుమార్, భాస్కర్ లు కేంద్ర మంత్రి గడ్కరీతో భేటీ అయ్యారు. అలాగే, అరూర్ గ్రామ జంక్షన్ కూడా సమీప గ్రామాలు, స్థానిక రహదారులను జాతీయ రహదారి-65తో కలిపే అత్యంత కీలక కూడలిగా ఉందని ప్రభాకర్ మంత్రి గడ్కరీకి అందజేసిన వినతిపత్రంలో పేర్కొన్నారు.
ఈ రెండు జంక్షన్ల మీదుగా ప్రతిరోజూ భారీ సరుకు రవాణా వాహనాలు, బస్సులు, వ్యవసాయ వాహనాలు, పాఠశాల బస్సులు, ద్విచక్ర వాహనాలు పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయన్నారు.వేలాది మంది రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, ప్రజలు విద్యాసంస్థలు, ఆసుపత్రులు, మార్కెట్లు, కార్యాలయాలకు వెళ్లేందుకు ఈ మార్గాలనే వినియోగిస్తుంటారని వినతిపత్రంలో వివరించారు.
అయితే ఈ ప్రాంతాల్లో ఫ్లైఓవర్లు లేదా గ్రేడ్ సెపరేటర్లు లేకపోవడంతో రోడ్డు ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయని, గతంలో అనేక ఘోర ప్రమాదాల్లో పలువురు ప్రాణాలు కోల్పోయిన ఉదంతాలను రవిచంద్ర, ప్రభాకర్, మాణిక్ రావులు కేంద్ర మంత్రి గడ్కరీ దృష్టికి తెచ్చారు.ఎన్‌హెచ్-65పై రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ ఈ సమస్యను మరింత తీవ్రతరం చేస్తోందని తెలిపారు.
ఈ రెండు జంక్షన్ల వద్ద ఫ్లైఓవర్లు నిర్మిస్తే:
» **రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గి ప్రజల భద్రత మెరుగుపడుతుంది.**
» **జాతీయ రహదారిపై ట్రాఫిక్ అంతరాయం లేకుండా సాఫీగా సాగుతుంది.**
» **ట్రాఫిక్ రద్దీ, ప్రయాణ సమయం తగ్గుతుంది.**
» **స్థానిక ప్రజలు, రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు, అత్యవసర సేవల వాహనాలు సురక్షితంగా ప్రయాణించగలుగుతాయి.**
» **సంగారెడ్డి జిల్లాలో ప్రాంతీయ అనుసంధానం, ఆర్థికాభివృద్ధికి మరింత ఊతం లభిస్తుంది.**
ఈ రెండు పురాతన, కీలక కూడళ్ల వద్ద ఫ్లైఓవర్ల నిర్మాణం ప్రజల ప్రాణ రక్షణకు, సురక్షిత రవాణాకు అత్యంత అవసరమని ప్రభాకర్ పేర్కొన్నారు. ఈ ప్రజాహిత ప్రతిపాదనను సానుకూలంగా పరిశీలించి, నిజాంపూర్ ఎక్స్‌రోడ్డు, అరూర్ గ్రామ జంక్షన్‌ల వద్ద ఫ్లైఓవర్ల నిర్మాణానికి తక్షణమే పరిపాలనా అనుమతులిచ్చి,నిధులు మంజూరు చేయాల్సిందిగా గడ్కరీకి అందజేసిన వినతిపత్రంలో ఎమ్మెల్యే ప్రభాకర్ కోరారు.

# కేటీఆర్ జన్మదినం సందర్భంగా చిరు వ్యాపారులకు గొడుగుల పంపిణీ

- వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం





**కరపత్రం ప్రతినిధి వరంగల్,జూలై 24**
బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టి.రామారావు (కేటీఆర్) జూలై 24 జన్మదినాన్ని పురస్కరించుకుని వరంగల్ తూర్పు నియోజకవర్గంలో చిరు వ్యాపారులకు గొడుగులను పంపిణీ చేశారు.గ్రేటర్ వరంగల్ తొలి మేయర్,వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా నన్నపునేని నరేందర్ మాట్లాడుతూ.. ప్రజలకు అండగా నిలుస్తూ సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి ఉపయోగపడడం కేటీఆర్ రాజకీయ జీవన విధానమని అన్నారు.ఆయన జన్మదినాన్ని అదే స్ఫూర్తితో సేవా కార్యక్రమాల ద్వారా నిర్వహించడం ఆనందంగా ఉందని తెలిపారు.వర్షాకాలంలో చిరు వ్యాపారులు ఎదుర్కొనే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వారికి ఉపయోగపడేలా గొడుగులను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల సంక్షేమం,అన్ని వర్గాల అభివృద్ధినే లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తోందని నరేందర్ అన్నారు.ఈ కార్యక్రమంలో వరంగల్ తూర్పు నియోజకవర్గానికి చెందిన మాజీ కార్పొరేటర్లు,బీఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షులు,ఇన్‌చార్జిలు,ముఖ్య నాయకులు, మహిళా నాయకురాళ్లు, యువజన నాయకులు, కార్యకర్తలు,అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.